## బీఆర్ఎస్‌లోకి చేరికలు



మండలంలోని మైలారం గ్రామానికి చెందిన సుమారు 200 మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు నందు, విక్రమ్‌రెడ్డి, సోమ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

–ధర్పల్లి, నవంబర్ 11

# చాయ్ చేసి.. బజ్జీలు అమ్మి..

## ధర్పల్లిలో బాజిరెడ్డి జగన్ ఎన్నికల ప్రచారం



ధర్పల్లిలో ప్రచారంలో భాగంగా చాయ్ చేస్తున్న బాజిరెడ్డి జగన్

ధర్పల్లి, నవంబర్ 11 : మండల కేంద్రంలో ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్.. శనివారం బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓ హోటల్ వద్దకు వెళ్లిన జగన్.. చాయ్ చేసి బజ్జీలను విక్రయించారు. అనంతరం తాను చేసిన చాయిని ప్రచారంలో పాల్గొన్న వారికి అందజేసి, టీ నిర్వాహకుడికి డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రూరల్ ఎమ్మెల్యేగా బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మైనార్టీ నాయకుడు జమీల్ కుమారుడు మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, మాజీ చైర్మన్ జీయర్ కిశోర్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, సురేందర్ గౌడ్, పుప్పాల సుభాష్, చెలిమెల రంజిత్, అబ్దుల్ మాజిద్, నజీర్, భోజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, పోతరాజు పాల్గొన్నారు.

# చంద్రమోహన్‌కు జిల్లాతో అనుబంధం



ఇందూరులో నిర్వహించిన నాటక ప్రదర్శనకు హాజరైన చంద్రమోహన్‌ను సన్మానిస్తున్న కవులు, కళాకారులు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 11 : ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్ శనివారం కన్నుమూశారు. చంద్రమోహన్‌కు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు నాటక రంగ సంస్థలతో అవినాభావ సంబంధం ఉన్నది. ప్రముఖ నాటక ప్రయోక్త శ్రీపాద కుమారశర్మ, ప్రముఖ నాటక రంగ కళాకారుడు ఎ.చంద్రప్రకాశ్, ప్రముఖ కవి వీపీ చందన్‌రావు అనేక సందర్భాల్లో చంద్రమోహన్‌ను కలిశారు. 1986లో బ్యాంకు ఉద్యోగి శశాంకా దర్శకత్వంలో చేదు నిజాలు అనే నాటకాన్ని హరిచరణ్ మార్వాడీ విద్యాలయంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వీపీ చందన్‌రావు వ్యవహరించి, సన్మానపత్రాన్ని చదివి చంద్రమోహన్ నుంచి ప్రశంసలు పొందారు. జిల్లాకు చెందిన పలువురు ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగు సినిమా రంగంలో ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించిన నటుడు చంద్రమోహన్ కథనాయకుడిగా 932 సినిమాల్లో నటించారని, 175 చిత్రాల్లో హీరోగా నటించారని గుర్తుచేసుకున్నారు.

## ఎన్నికల సంబంధిత అంశాలపై నేరుగా ఫిర్యాదులు చేయవచ్చు

### అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిశీలకుడు గౌతమ్‌సింగ్

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 11 : నిజామాబాద్ అర్బన్, రూరల్ శాసనసభ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి అంశమైనా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల సాధారణ పరిశీలకుడు గౌతంసింగ్ సూచించారు. శనివారం ఆయన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. అర్బన్, రూరల్ సెగ్మెంట్లలో ఎన్నికలతో ముడిపడిన ఏ విషయమైనా తన దృష్టికి తీసుకరావచ్చని ప్రజలకు సూచించారు. సెలవు దినాల్లో మినహాయించి మిగతా అన్ని దినాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు తాను జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు తనను నేరుగా కలిసి ఎన్నికల సంబంధిత అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. తనను నేరుగా కలిసేందుకు వీలు పడని వారు 8332021749కు నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద తనిఖీలు




కందకుర్తి చెక్ పోస్టు వద్ద బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

రెంజల్, నవంబర్ 5: మండలంలోని కందకుర్తి సమీపంలోని అంతర్రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఎన్నికల వ్యాయ అధికారిణి తాయసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వచ్చి పోయే వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని సిబ్బందినీ ఆదేశించారు. ఈమార్గం గుండా వచ్చే ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా చేసే అవకాశం ఉందని, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. చెక్ పోస్టు వద్ద పలు బస్సులు, కార్లు ఇతర వాహనాలను సిబ్బంది తనిఖీ చేశారు. ఆమె వెంట బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజు, ఎస్సై ఉదయ్‌కుమార్, వివిధ శాఖల తనిఖీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## నాడు సింగిల్..



## నేడు డబుల్



సమైక్య పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా రోడ్లు ధ్వంసమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యేవాడు. స్వరాష్ట్రంలో పరిస్థితి మారింది. కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, పుష్కలంగా నిధులు మంజూరుచేసింది. దీంతో గ్రామాలు అభివృద్ధి బాటలో దూసుకెళ్తున్నాయి. ప్రతి గ్రామంలో రోడ్లు అద్దంలా మారాయి. బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకొని పట్టణంలోకి వెళ్లడానికి గతంలో సింగిల్ రోడ్డు మాత్రమే ఉండేది. దీంతో వాహనాల రద్దీతోపాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. మంత్రి వేములప్రశాంత్‌రెడ్డి రూ. 9 కోట్ల నిధులు మంజూరు చేయడంతో సింగిల్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చి డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చి దిద్దారు. దీంతో బాల్కొండ నియోజకవర్గ కేంద్రం నూతన శోభను సంతరించుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–బాల్కొండ, నవంబర్ 11

# ఎస్సారెస్పీ నీటిమట్టం తగ్గుముఖం

మెండోరా, నవంబర్ 11: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో కాకతీయ కాలువకు నీటి విడుదల నిలిపివేయడంతో నీటిమట్టం స్వల్పంగా తగ్గుతున్నదని ఏఈఈ రవి తెలిపారు. సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 200.362 టీఎంసీల వరద వచ్చి చేరిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు 90.313 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రానికి 1089.10 అడుగుల (80.131 టీఎంసీలు) వద్ద ఉన్నదని తెలిపారు.

# సీనియర్ నాయకుడు గంగాధర్ మృతి

శక్కర్‌నగర్, నవంబర్ 11: బోధన్ పట్టణం రంగర్‌గల్లీకి చెందిన సీనియర్ నాయకుడు ఆర్. గంగాధర్ (68) అనారోగ్యానికి గురై, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానాలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బోధన్ పట్టణానికి చెందిన ఆయన పలు పార్టీల్లో నాయకుడిగా పనిచేయడంతో పాటు, పలు కంపెనీలకు అకౌంటెంట్‌గా విధులు నిర్వహించాడు. బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర మందిరంతోపాటు పట్టణంలోని పలు దేవాయాల వద్ద నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ స్వచ్ఛందంగా సేవలు అందించేవాడు. ఆయన మృతిపై పలువురు ప్రగాఢ సానుభూతిని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు.